

నెరవేరని కల

ఏళ్లు గడిచినా పూర్తికాని టిడ్కో గృహాలు

గత టీడీపీ పాలనలో నిర్మాణం ప్రారంభం

గృహ నిర్మాణాన్ని పూర్తి చేయని వైసీపీ

కూటమి పాలనలో లబ్ధిదారుల్లో చిగురిస్తున్న ఆశలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి కావడం లేదు. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అవి కంప చెట్లతో నిండిపోతున్నాయి. రాష్ట్ర విభజన తరువాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ పేదల సొంతింటి కలను నెర వేర్చేందుకు పూనుకుంది. వ్యక్తిగత గృహాలేకాకుండా పట్టణాల్లో అపార్ట్‌మెంట్ తరహాలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ పక్కా గృహాల (టిడ్కో ఇళ్లు)నిర్మాణాన్ని చేపట్టింది. దాదాపు 80శాతం పనులను పూర్తి చేసింది. అయితే 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో మిగిలిన పనులు నిలిచిపోయాయి.



రూ.50వేలు కట్టా

మాకు టిడ్కో గృహం మంజూరు కావడంతో లబ్ధిదారు వాటాగా అప్పట్లో రెండు కంతులకు రూ.50వేలు చెల్లించా. సొంతింటి కల నెరవేరుతోందని ఎంతో సంతోషపడ్డా. అయితే వైసీపీ హయాంలో వాటిని గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం మా కష్టాలను గుర్తించి పనులను పూర్తి చేసి టిడ్కో గృహాలను మాకు అప్పగించాలి.

- సుమలత, కర్నాటక నాగేపల్లి

బిల్లులు రాకపోవడం వల్లే...

ధర్మవరంలో రివర్స్ టెండర్‌ద్వారా పనులు చేపట్టిన ఎన్‌జేఆర్ కంపెనీకి బిల్లులు రాకపోవడంతో పనులు పూర్తి చేయలేదు. మిగతా మున్సిపాలిటీలలో టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులే తప్పా తరువాత ఎలాంటి పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాల వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

- తిరుమణి, టెక్నికల్ ఆఫీసర్

కంపచెట్ల మరుగున టిడ్కో ఇళ్లు

ఎంపిక చేసిన నాలుగు మున్సిపాలిటీలకు ప్రభుత్వం 5290 టిడ్కో ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో పుట్టపర్తి 1247, ధర్మవరం1440, కదిరి 1104, హిందూపురం మున్సిపాల్టీకి 1500 గృహాలు మంజూరయ్యాయి. 275, 360, 430 చదరపు అడుగులు కలిగిన ప్లాట్లను మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించారు. లబ్ధిదారులు తమ వాటా సొమ్మును అప్పట్లోనే చెల్లించారు. అయితే ప్రభుత్వం మారడంతో టిడ్కో గృహాల నిర్మాణం ఆగిపోయింది. దీంతో అటువైపు వెళ్లే వారే లేకుండాపోయారు. ఫలితంగా టిడ్కో ఇళ్ల మధ్య , చుట్టూర కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ఈక్రమంలోనే ఆ ఇళ్లు శిథిలమవ్వాల్సిందేనా అని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేసేశారు. అయితే 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో టిడ్కోగృహాల లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఆయా పట్టణా ల్లోని లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో సొంతింటి కల నెరవేరుతుందన్న నమ్మకంతో లబ్ధిదారులు ఉన్నారు.



జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్లు

శ్రీసత్యసాయి జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల్లోని పేదలకు అపార్ట్‌మెంట్ తరహాలో టిడ్కో గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం ప్రాంతాల్లో పేదలను గుర్తించి టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది. 2019 ఎన్నికల ముందే 80శాతం పనులు పూర్తి చేసింది. అయితే 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో ఆ ఇళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అధికారం చేపట్టిన వైసీపీ టిడ్కో ఇళ్ల ఊసే పట్టించుకోలేదు.

తొమ్మిదేళ్లుగా నిరీక్షణ



గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చింది. అప్పట్లో లబ్ధిదారుల వాటా కింద రూ.36వేలు చెల్లించా. ఆ తరువాత టిడ్కో గృహాల కాంట్రాక్టర్ మా పేరున బ్యాంకులో రూ.3లక్షలు రుణం తీసుకున్నట్లు తెలిసింది. రుణానికి సంబంధించి ఈఎంఐ రూ.7వేలు కట్టాలని మేసేజ్ వస్తోంది. కూటమి ప్రభుత్వం ఇళ్లు పూర్తి చేసి మాకు ఇస్తే ఈఎంఐ కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.

-శిరిపురం అమల, పుట్టపర్తి

ఇది పద్ధతేనా మాస్టారూ..!

- బడిలో హెచ్‌ఎం అకృత్యాలు
- తల్లిదండ్రులకు చెప్పిన విద్యార్థులు
- విచారించిన విద్యాశాఖ అధికారులు



తల్లిదండ్రులతో చర్చిస్తున్న ఎంఈఓలు జాన్ రెడ్డెప్ప, గోపాల్, సీఐ శేఖర్

గోరంట్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆయన పేరు నాగేశ్వరరావు. చిన్నతనంలో జరిగిన పేలుడులో రెండు కళ్లు పోయాయి. ఎడమచేయి మణికట్టుదాకా తెగిపోయింది. దివ్యాంగుల కోటాలో ఉపాధ్యాయుడు అయ్యారు. ప్రస్తుతం గోరంట్ల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా చేస్తున్నారు. అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో పలువురు విద్యార్థినులు మంగళవారం తల్లిదండ్రులకు చెప్పేందుకు వెళ్లారు. దీంతో మాస్టారు బడి నుంచి మాయమయ్యారు. తల్లిదండ్రులు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎంఇఓలు జాన్ రెడ్డెప్ప, గోపాల్, సీఐ శేఖర్, ఎస్‌ఐ శ్రీనివాసులు పాఠశాలకు చేరుకుని విచారించారు. ఆఫీస్ రూమ్‌లో స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తారని, అక్కడే మూత్రవిసర్జన చేస్తారని, ఉమ్మి వేస్తారని, తాగి గదిలోనే పడిపోతారని విద్యార్థులు... అధికారులకు వివరించారు. బాలికలను గదిలోకి పిలిపించి కొడతారని, తాకరాని చోట తాకుతారని ఫిర్యాదు చేశారు. గతంలో మందలించినా ఆయన ప్రవర్తన మారలేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలతో 93 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అంధుడు కావడంతో హెచ్‌ఎం నాగేశ్వరరావు పాఠాలు చెప్పేవారు కాదు. ఉపాధ్యాయులు చంద్ర, చలపతి, క్రిష్ణమూర్తి తదితరులను పిలిపించి అధికారులు విచారించారు. హోమ్‌వర్కు చేయనివారి, సరిగా చదవని వారిని తన గదిలోకి పిలిపించుకుని మందలించేవారని, గదిలో అసభ్యప్రవర్తన గురించి తమకు తెలియదని వారు అధికారులకు తెలిపారు. మద్యం సేవించి పడిపోవడం వాస్తవమేనని అన్నారు. దీంతో ఈ విషయాన్ని తమ దృష్టికి ఎందుకు తేలేదని ఎంఈఓలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బూతులు తిడుతూ కొడుతుంటారని సీఐ శేఖర్‌కు బాలురు ఫిర్యాదు చేశారు. వెంటనే పాఠశాలకు రావాలని హెచ్‌ఎంకు అధికారులు ఉపాధ్యాయులతో ఫోన్ చేయించారు. తాను పుట్టపర్తిలో ఉన్నానని ఆయన చెప్పడంతో హాజరు పట్టీలో ఉదయం సంతకం పెట్టి వెళ్లిపోయినట్లు ఎంఈఓలు రికార్డు చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఫిర్యాదు రాయించుకుని, డీఈఓకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి తల్లిదండ్రులు అయిష్టత చూపారు. కేసు పెడితే స్టేషన్, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందని, చిన్నారుల భవిష్యత్తు దృష్ట్యా ఫిర్యాదు చేయలేమని అన్నారు. హెచ్‌ఎంను బదిలీ చేసి, ఆ స్థానంలో వేరేవారిని నియమించాలని కోరారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వికాస్‌జైన్



ఆలయ ప్రాంగణంలో పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వికాస్‌జైన్, కుటుంబ సభ్యులు

లేపాక్షి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని పాట్నా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వికాస్ జైన్ అన్నారు. లేపాక్షి ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కళ్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆలయంలో శిల్పాలు, చిత్ర కళ అద్భుతంగా ఉన్నాయని అన్నారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గావీరభద్రులకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్థానిక తహసీల్దారు సౌజన్యలక్ష్మి, ఆలయ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై సైన్సు, ఒకేషనల్ అధ్యాపకులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఐదో తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు. పదో తేదీ నుంచి జనరల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల స్పెషల్ అధికారి చెన్నకేశవ ప్రసాద్, జిల్లా పరీక్షల కమిటీ మెంబర్లు సురేష్ బాబు, రామరాజు, శ్రీనివాసు రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి ధర్మవరం సమస్యలు

మంత్రిని కలిసిన పరిటాల శ్రీరామ్



లోకేశ్‌ను కలిసిన శ్రీరామ్

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో చేనేతలు, విద్యార్థులు, హాకీ క్రీడాకారుల సమస్యల్ని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం విజయవాడలో మంత్రి నివాసంలో కలిసి ధర్మవరం నియోజకవర్గంలోని పలు అంశాలపై వినతి పత్రాలు అందజేశారు. ముఖ్యంగా శిల్క్ రాయితీ అంశాన్ని ప్రస్తావించారు. చేనేత పరిశ్రమకు కేంద్రం నుంచి నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిల్క్‌పై రాయితీ అందేదని వివరించారు. ప్రతిచేనేత కార్మికుడికి ఇది ఉపయోగపడేదన్నారు. ఈ పథకం వర్తిస్తే చేనేతకు అనుబంధంగా ఉన్న డైయింగ్, శిల్క్ మర్చంట్స్, రీలర్స్, ట్విస్టర్స్, వైండింగ్ తదితర విభాగాలకు ఉపాధి లభిస్తుందన్నారు. హాకీ ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్, హాకీ అకాడమీ మంజూరు చేయాలని కోరారు. హాకీలో శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఎంతో మంది రాణిస్తున్నారని అన్నారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. వెంటనే శాప్ చైర్మన్‌ను కలిసి వివరించాలని, త్వరలో ధర్మవరంలో హాకీకి గ్రౌండ్ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. రేగాటిపల్లిలో ఉండాల్సిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర రెసిడెన్సియల్ పాఠశాలను ప్రస్తుతం బత్తలపల్లిలో నిర్వహిస్తున్నారని, దానికి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. శ్రీరామ్ చెప్పిన అన్ని అంశాలపై లోకేశ్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తాగునీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

కలెక్టర్ టీఎస్ చేతన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ తదతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ రూపొందించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబయ్యను ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ మల్లికార్జున, డీపీఓ సమత, వ్యవసాయ శాఖ జేడీ సుబ్బారావు, డీఈఓ క్రిష్టప్ప, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, జలవనరుల శాఖాధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పని చేయాలి: ఎస్పీ రత్న



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సాయుధ పోలీసులంటే సత్యసాయి జిల్లా పేరుచెప్పుకునే విధంగా పేరు తీసుకు రావాలని ఎస్పీ వి.రత్న సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో రెండు వారాలుగా నిర్వహిస్తున్న జిల్లా సాయుధ పోలీసు డీమొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులకు మంచి పేరుందన్నారు. జిల్లాలో జరిగిన అనేక సంఘటనలు, సాంఘిక, రాజకీయ, మతపరమైన కార్యక్రమాల్లో సాయుధ పోలీసులు అత్యంత క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి మంచిపేరు తీసుకొచ్చారని గుర్తు చేశారు. సాయుధ పోలీసుల విధులు నిత్యం సవాళ్లతో కూడుకున్నవని పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమంలో ఎలాంటి సమస్యలున్నా తనదృష్టికి తేవాలని సూచించారు. మొబలైజేషన్ ప్రక్రియలో కీలకంగా విధులు నిర్వర్తించిన శ్రీధర్, నారాయణస్వామి, ఏవీరెడ్డి, వీరాంజనేయులు, షేక్షావలి, చాంద్‌బాషా, భాస్కర్ గోవిందులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు వలి పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

కదిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారు ఉదయం 6గంటలకే తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్య కైంకర్యాలు, ఆస్థాన పూజలు పూర్తయిన తర్వాత విశేషంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ఆశీనులను గావించి తిరుమాడవీధుల్లో విహరింపజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పింఛన్.. నో టెన్షన్..!

ఉదయం 7 గంటల తర్వాతే పంపిణీ

సీఎంతో చర్చించి పరిష్కరించిన మంత్రి

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ కోసం ప్రతినెలా టెన్షన్ పడుతున్న సచివాలయ సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఉపశమనం కలిగించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే పంపిణీ చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇబ్బంది పడుతున్న సచివాలయ ఉద్యోగుల సమస్యను పరిష్కరించారు. తెల్లవారుజామున వెళుతున్న క్రమంలో సచివాలయ ఉద్యోగులు ప్రమాదాలకు గురవుతున్నారని, మహిళా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని గత నెలలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సమస్యను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని, ఉదయం 7గంటల తరువాత పింఛన్లు చేయాలని ప్రకటించినట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ప్రపంచానికి అనంత పంట

నేడు అనంత ఉద్యాన సమ్మేళనం

అరటి సహా ఉద్యాన దిగుబడుల ఎగుమతే లక్ష్యం

మూడు ప్రముఖ కంపెనీలతో ఒప్పందం

హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులు



ఎగుమతి చేసేందుకు అరటి దిగుబడులను సిద్ధం చేస్తున్న రైతులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 'అనంత ఉద్యాన సమ్మేళనం' నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా హార్టికల్చర్ కాంక్లేవ్ జరగనుంది. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, దేశ విదేశీ కంపెనీల ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,04021 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఏడాదికి 25.96 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన దిగుబడులతో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పేరు సంపాదించింది. జిల్లా జీవీఏలో 45 శాతం వాటా ఒక్క ఉద్యాన ఉత్పత్తుల ద్వారా లభిస్తోంది. రాష్ట్ర జీఎస్‌డీపీలో 11.73 శాతం వాటా జిల్లా ఉద్యాన ఉత్పత్తుల ద్వారా సాకారమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వర్ణాంధ్ర అనంతపూర్ విజన్-2047 సాధించేందుకు అరటి, ఎండు మిరప, చీనీ, టమోటా, మామిడి పంటలను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజన్స్‌గా (తరువాయి 7లో..)

హ్యాపీ న్యూ ఇయర్.. చైనా..!





చైనా నూతన సంవత్సర వేడుకల్లో అలరించిన ప్రదర్శనలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో మంగళవారం సాయంత్రం చైనా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదట చైనా భక్తులు వేదపఠనంతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం చైనా నూతన సంవత్సర వేడుకల గురించి వివరించారు. ప్రతి ఏడాది సత్యసాయి మహాసమాధి సన్నిధిలో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవడం చైనీయులకు ఆనవాయితీగా వస్తోంది. చైనా సంప్రదాయ రీతిలో భక్తి పాటలు పాడుతూ నృత్యప్రదర్శన చేశారు. అనంతరం డ్రాగన్‌డ్యాన్స్ నిర్వహించారు. భక్తి గీతాల ఆలపన చేపట్టారు. మరో రెండు రోజులుపాటు వేడుకలు జరగనున్నాయి.





సంప్రదాయ నృత్యాలు చేస్తున్న చైనీయులు



రైతు బిడ్డ

కూడేరు మండలం శివరాంపేట రైతు ఎర్రిస్వామికి నలుగురు కూతుళ్లు. ముగ్గురిని పదో తరగతి వరకూ చదివించి, పెళ్లి చేసి అత్తారింటికి పంపించారు. చిన్న కూతురు ఇందు ఉరవకొండలో డిగ్రీ చదువుతోంది. ఎర్రిస్వామికి రెండు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు గ్రామ సమీపంలో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని, వేరుశనగ సాగు చేశారు. రబీ పంట కావడంతో బోరు నీరే ఆధారం. ఆయనకు కొడుకులు లేరు. ఆ లోటును ఇందు తీరుస్తోంది. ఉదయమే నాన్నతో కలిసి పొలానికి వెళుతుంది. తుంపర సేద్యంలో సాయపడుతుంది. నాన్నతో కలిసి బరువైన పైపులను భుజానికి ఎత్తుకుని.. పొలంలో మారుస్తుంది. ఆ తరువాత ఇంటికి వెళ్లి తయారై.. కాలేజీకి వెళుతుంది. 'నా భార్య కూలి పనులకు వెళుతుంది. సేద్యంలో నా బిడ్డ తోడుగా ఉంటోంది' అని ఎర్రిస్వామి అన్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

వైభవంగా రథసప్తమి వేడుకలు

● ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి

ఉరవకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వ ండ లం లోని బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి కాకుండా, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అష్టోత్తర శతక్షీరాభిషేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఛాయా ఉష సమేత సూర్యనారాయణస్వామిని పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి అర్చకులు కల్యాణా న్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహాగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, మహాసౌరపూర్వక అరుణహోమాన్ని చేపట్టారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు మహేంద్రగౌడ్, సుధాకర్, కృష్ణమెహన్ పాల్గొన్నారు.

ప్రణాళికతో పదింతల ఫలితం

సాధన చేస్తే మంచి మార్కులు

పది విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు



కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితానికి తొలి సోపానం పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా రోజు విడిచి రోజు పరీక్షలు ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సంవత్సరమంతా కష్టపడి చదివిన శ్రమ వృథాకాకుండా ఉండాలంటే రాబోయే కాలాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులు టైం టేబుల్ రూపొందించుకొని చదివితే మంచి మార్కులు సాధించవచ్చని, చదువుతో పాటు తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని చెబుతున్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయుల సూచనలు ఇలా ఉన్నాయి.

● సులభంగా తెలుగులో మార్కులు

- విశ్వేశ్వరరావు, తెలుగు పండిట్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



తెలుగులో మంచి మార్కులు సాధించుకోవడం విద్యార్థుల చేతుల్లోనే ఉంది. చక్కటి రాత, అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా జాగ్రత్తపడాలి. అవగాహన, ప్రతిస్పందనకు 32 మార్కులు, వ్యక్తీకరణ, సృజనాత్మకతకు 36 మార్కులు, భాషాంశాలకు 32 మార్కులు ఉంటాయి. పద్యపాఠ్యంశాల నుంచి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి రెండు మార్కులు. రెండో ప్రశ్న పరిచిత గద్యభాగం, మూడో ప్రశ్న ఉపవాచకం నుంచి ఉంటాయి. నాలుగు వాక్యాలిచ్చి ఏ కాండమునకు చెందినదో రాయాలి. నాల్గో ప్రశ్నగా పత్రికా ప్రకటన, లేఖ, అపరిచిత గద్యంలో ఏదో ఒక అంశం ఇచ్చి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వాటిని చదివి ఒక వాక్యంలో సమాధానం రాస్తే నాలుగు ప్రశ్నలకు ఎనిమిది మార్కులు వస్తాయి. వ్యక్తీకరణ, సృజనాత్మకత భాగంలో 5,6,7 ప్రశ్నలన్నీ రాయాలి. కవి పరిచయం, పద్య పాఠ్యాంశాలు చదవాలి. 6,7 ప్రశ్నలకు పరిచయం, కథనం, వ్యాసం, నాటకం, నేపథ్యం ఉంటాయి. 8,9,10 వ్యాసరూప ప్రశ్నలు ఉంటాయి. 11 నుంచి 19 వరకూ రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఇందులో.. శబ్ద, అర్థాలంకారాలు, చందస్సు, జాతీయాలు, సంధులు, సమాసాలు ఉంటాయి. వీటిపై నిరంతరం సాధన అవసరం.

● హిందీ కష్టమేమీ కాదు

- ఇందిర, హిందీ పండిట్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



హిందీ అంటే కష్టం అనే భయాన్ని వదిలేయాలి. హిందీలో పద్యాలు, వ్యాకరణం, సాహిత్యం నేర్చుకుంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సాలీ పాఠం నుంచి మొదటి నాలుగు ప్రశ్నలు, దోహే పాఠం నుంచి ఏదో ఒక ప్రశ్న ఉంటుంది. ఉపవాచకంలో మొదటి, రెండు పాఠ్యాంశాల నుంచి రెండు ప్రశ్నలు ఇస్తారు. పద్యాలు, కవులు, పాఠాలు, రచయితల గురించి తండ్రి, పుస్తక విక్రేతకు లేఖ రాయడం నేర్చుకోవాలి. ఎస్‌సీఈఆర్‌టీ ప్రణాళికను అనుసరిస్తే 90 శాతం పైగా మార్కులు సాధించవచ్చు.

● ఆంగ్లంపై ఆందోళన వద్దు

- ఎల్‌వీ రమణ, ఆంగ్ల ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



ఆంగ్లం అంటే అందరూ ఆందోళన పడుతుంటారు. అర్థం చేసుకుంటూ చదివితే చాలా సులభం. ఆంగ్ల పరీక్ష పేపర్ మూడు భాగాలుగా ఉంటుంది. సెక్షన్-ఏలో రీడింగ్ కాంప్రెహెన్షన్ 30 మార్కుల్లో 24 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఆరు మార్కులకు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. 1 నుంచి 15, 16, 17 ప్రశ్నలపై దృష్టి సారిస్తే మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్-బిలో ఒకాబులరీ, గ్రామర్ 40 మార్కులకు ఉంటుంది. మొత్తం పాఠ్యంశాలు బాగా చదివితే 18 నుంచి 34 ప్రశ్న వరకూ సమాధానాలు రాసి మార్కులు సాధించవచ్చు. సెక్షన్-సిలో 30 మార్కుల్లో 35 వ ప్రశ్న డైరీ రైటింగ్, 36వ ప్రశ్న లెటర్ రైటింగ్, 37వ ప్రశ్న పేరాగ్రాఫ్ రైటింగ్ ఉంటాయి. క్రియేటివ్, లెటర్ రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ ప్రశ్నలపై సాధన చేయాలి.

● మ్యాప్‌లపై దృష్టి సారించాలి

- మాధవీలత, సాంఘిక శాస్త్రం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లు గీయడం, ప్రాంతాలు గుర్తించడంపై దృష్టి సారించాలి. పరీక్షల్లో 33 ప్రశ్నలు, 4 సెక్షన్లు ఉంటాయి. జాగ్రఫీ, చరిత్ర, పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం ప్రశ్నలకు 23 చొప్పున మార్కులు, మ్యాప్ పాయింటింగ్‌కు 8 మార్కులు ఉంటాయి. 4,8 ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు విధిగా సైడ్ హెడ్డింగులు పెట్టాలి. పాయింట్ల రూపంలో జవాబులు రాస్తూ ప్రధాన విషయానికి అండర్‌లైన్ చేయాలి. అక్షరాలు గుండ్రంగా రాస్తే పూర్తి మార్కులు సాధించవచ్చు.

● చిత్రాలపై సాధన చేయాలి



భౌతిక శాస్త్రం 50 మార్కులకు ఉంటుంది. 17 ప్రశ్నలకు జవాబులు రాసేందుకు సమయం రెండు గంటలు. ఒకమార్కు ప్రశ్నలు 8 ఉంటాయి. రెండు మార్కుల ప్రశ్నలు మూడు, నాలుగు మార్కుల ప్రశ్నలు మూడు ఉంటాయి. (వీటికి చాయిస్ ఉండదు) 12వ ప్రశ్నకు డయాగ్రామ్‌కు చాయిస్ ఉంటుంది. 8 మార్కుల ప్రశ్నకు అంతర్గత చాయిస్ ఉంటుంది. ఆమ్లాలు, క్షారాల యందు చాయిస్‌తో కలిపి 9 మార్కులు ఉంటాయి. కాంతి పరావర్తనము, వక్రీభవనములో చాయిస్‌తో కలిపి 9 మార్కులకు ఉంటుంది. విద్యుత్, మానవుని కన్ను అందమైన ప్రపంచము యూనిట్‌లో 8 మార్కులకు చాయిస్ ఉంటుంది. రసాయన చర్యలు, సమీకరణాలు, కర్బన సమ్మేలనాలలో 8 మార్కులకు చాయిస్ ఉంటాయి. విద్యుదయస్కాంత యూనిట్, లోహాలు, అలోహాల నందు 8 మార్కులకు చాయిస్ ఉంటుంది. కర్బన సమ్మేళనం యూనిట్‌లో 10 మార్కులు సాధించవచ్చు.

- ఇర్షాద్‌వలి, ఫిజిక్స్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

● గణితంలో వంద మార్కులు సాధ్యమే



ఇతర సబ్జెక్టులతో పోలిస్తే గణితంలో వందకు వంద మార్కులు సాధించవచ్చు. గణితంలో నాలుగు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-1లో 12, సెక్షన్-2లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. త్రికోణమితిలో ప్రతి లెక్కనూ బొమ్మలతో వివరిస్తే మంచి మార్కులు వస్తాయి. ప్రతి లెక్కకూ సూత్రాలను అన్వయించాలి. త్రిభుజాలు, రేఖా సమీకరణాలు, ఉపరితల వైశాల్యం తదితర పాఠాల నుంచి 1,2 మార్కులు ఎక్కువగా వస్తాయి. బహుపదుల నుంచి నాలుగు మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. గ్రాఫ్ ఆధారిత లెక్కలు, సాంఖ్యక శాస్త్రం, రేఖా గణితం, వాస్తవ సంఖ్యలపై పట్టు సాధించాలి. ముఖ్యమైన సూత్రాలను గుర్తు పెట్టుకోవాలి. (హెచ్.సి.బి), గ.సా.భ,(ఎల్.సి.బి), కసాగు అంక గణితం, సగటు, మధ్యగణితం, బాహులకం వంటి లెక్కలపై దృష్టి పెట్టాలి. కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.

- డి.భాస్కర్‌రెడ్డి, గణితం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

● బ్లూప్రింట్ ఆధారంగా చదవాలి

జీవశాస్త్రంలో 50 మార్కులకు 17 ప్రశ్నలు ఉంటాయి. బ్లూప్రింట్ ఆధారంగా జీవక్రియలు అనువంశికత, ప్రత్యుత్పత్తిపై విద్యార్థులు దృష్టిసారించి చదివితే అధిక మార్కులు సాధించవచ్చు. చిత్రాలు, భాగాలు గుర్తించడం వంటి ఆధారంగా ప్రశ్నలు ఉం టాయి. ప్రయోగాలు చేసే విధానం భే దాలపై సాధన చేయా లి. వీటిని అనుసరిస్తే విద్యార్థులు జీవశాస్త్రంలో అనుకున్న మార్కులను సాధించగలుగుతారు.



- వెంకటశివారెడ్డి, జీవశాస్త్రం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

ఎన్నేళ్లు ఇలా..?

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం అన్నదాతల నిరీక్షణ

జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో 50వేలకుపైగా దరఖాస్తులు

డబ్బులు చెల్లించి ఎదురుచూస్తున్న 11 వేల మంది

వేధిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల కొరత

అనంతపురం రూరల్/కూడేరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బోరు బావుల్లో సమృద్ధిగా నీరున్నా, విద్యుత్ సౌకర్యం లేక రైతులు పంటలు సాగు చేయలేని స్థితిని ఎదుర్కొంటు న్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం వేల దరఖాస్తులు విద్యుత్ శాఖలో మూలుగుతున్నాయి. జిల్లా విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం డబ్బులు చెల్లించి కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య 11వేలకు పైగానే ఉంది. ఈమేరకు రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కళ్యాణదుర్గం డివిజన్‌లో అధికంగా పెండింగ్

జిల్లాలోని అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ఇప్పటికే 2.02లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్ల పరిధిలో కొత్తగా మరో 50వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి తోడు 11,111 మంది రైతులు కనెక్షన్ల కోసం డబ్బులు చెల్లించి ఎదురుచూస్తున్నారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 6003, అనంతపురం డివిజన్ పరిధిలో 2847, గుత్తి డివిజన్ పరిధిలో 2261 మంది రైతులు డబ్బులు చెల్లించి కనెక్షన్ల కోసం నిరీక్షిస్తున్నారు. జిల్లా విద్యుత్ శాఖలో పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటి వరకు వ్యవసాయ కనెక్షన్ల కోసం చెల్లించిన వారికే 2,950 ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాల్సి ఉంది. ఇదే క్రమంలో కండక్టర్(వైరు) 2034కిలో మీటర్ల మేర అవసరం ఉంది.

ప్రజా ప్రతినిధులు చొరవ చూపితేనే...

ఏపార్టీ అధికారంలో ఉన్నా మాది రైతు ప్రభుత్వం. రైతుల సంక్షేమమే మాధ్యేయం అని నాయకులు, ప్రజాప్రతినిధులు ఊదరగొడుతుంటారు. కానీ వారి మాటలు, హామీలు అన్నీ నీటిమీద బుడగలే. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలే ఇందుకు నిదర్శనం. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో మంజూరుకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పంటకు నీరందించేందుకు కరెంటు కనెక్షన్ లేకపోవడంతో అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఇదే దౌర్భాగ్య పరిస్థితి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఇవి తెలియనివీ కావు. అయినా అలా వింటూ.. చూస్తూ.. ఉండిపోవడం వారికి పరిపాటైపోయింది. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే జిల్లా రైతాంగానికి మేలు జరిగే అవకాశం ఉంటుంది.

● ఏడాదిగా ఎదురుచూస్తున్నా



వ్యవసాయ కనెక్షన్ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా. ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చారు. కండక్టర్ ఇంత వరకు ఇవ్వలేదు. నాలుగు ఎల్‌టి స్తంభాలకు వైరు, మూడు స్తంభాలకు సర్వీసు వైరు ఇవ్వాల్సి ఉంది. ఇంత వరకు ఇవ్వలేదు.

- రమేష్, కొర్రకోడు, కూడేరు మండలం

● ఆరేడేళ్లుగా ఎదురుచూపులే



టీడీపీ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్ వచ్చింది. ఆ తరువాత ఇతర సామగ్రి ఏది ఇవ్వలేదు. ఇప్పటికి దాదాపు ఆరేడేళ్లు అవుతోంది. వైరు ఇవ్వలేదు. ఇతర సామగ్రి ఇవ్వలేదు. విసుగెత్తి అడగటమే మానేశా. పక్క రైతును అడిగి ఒకే దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకుని వినియోగించుకుంటున్నా.

- వెంకటేష్, రైతు కొర్రకోడు, కూడేరు మండలం

● వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చాం



జనవరి నెలలో రైతులకు వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు అందించాం. ఇంకా అవసరం ఉన్నాయి. ఆ మేరకు సంస్థ ఉన్నతాధికారులకు నివేదించాం. కండక్టర్ కొరత ఉంది. రెండువేల మీటర్ల కండక్టర్ కావాలి. ఈ నెలలో కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయి. వచ్చిన వెంటనే రైతులకు సీనియార్టీ మేరకు అందిస్తాం.

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

వాటర్‌షెడ్ పనుల్లో గోల్‌మాల్

గత ప్రభుత్వంలో రూ.5 కోట్ల దుర్వినియోగం

వైసీపీ కార్యాలయంలో వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు

నాయకులు, అధికారుల జేబుల్లోకి నిధులు

తాజాగా వెలుగులోకి వస్తున్న అప్పటి అక్రమాలు

అక్రమార్కులకు క్లీన్‌చిట్ ఇస్తున్న వైనం

డ్వామా విజిలెన్స్‌లో మాయాజాలం



పనిచేసిన ఏడాదిలోపే చిన్నపాటి వర్షానికే కొట్టుకు పోయిన గోళ్ల వాటర్‌షెడ్ పరిధిలోని రాతితో నిర్మించిన ఫారంపాండ్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనుల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, నాయకులు కుమ్మక్కై ప్రజాసొమ్మును మెక్కేశారు. గత ఐదేళ్లలో వాటర్‌షెడ్ నిధులను సుమారు రూ.5కోట్ల మేర బొక్కేశారు. వాటర్‌షెడ్ పనులన్నీ అప్పటి వైసీపీ నేతల కనుసన్నల్లో సాగాయి. పార్టీ కార్యాలయాల్లోనే వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు నిర్వహించడం ఇందుకు నిదర్శనం. వీటిపై నిఘా పెట్టాల్సిన నిఘా అధికారులే వారితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. వాటర్‌షెడ్ ద్వారా రూ.5కోట్ల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు సామాజిక తనిఖీలో తేటతెల్లమైంది. ఈ సొమ్మును రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజిలెన్స్ విభాగం నిర్లక్ష్యం చేస్తోంది. ఆ విభాగంలో కీలకంగా ఉన్న ఇద్దరు అధికారులతో పాటు పలువురు ఉద్యోగులు, వాటర్‌షెడ్ విభాగం అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది.

వైసీపీ నేతల కనుసన్నల్లోనే పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటర్‌షెడ్ పనులన్నీ ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో జరిగాయి. పంచాయతీ పరిధిలోని సర్పంచ్, గ్రామ పెద్దలు, వాటర్‌షెడ్ అధికారుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి పనులకు ఆమోదం పొందాలి. ఇందుకు భిన్నంగా వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధుల ఇళ్లలోనూ, వైసీపీ కార్యాలయాల్లోనూ నిర్వహించారు. పనులు చేయకపోయినా బిల్లులు చేసుకుని నిధులు స్వాహా చేశారు.

రూ.5 కోట్లు హాంఫట్

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాటర్ షెడ్ పథకం కింద రూ.6.5 కోట్ల వరకు నిధులు పక్కదారిపట్టాయి. ఇప్పటి వరకు రూ.1.5 కోట్లు మాత్రమే రికవరీ చేశారు. మిగిలిన సొమ్మును రికవరీ చేయడంలో నిఘా విభాగం అధికారులు విఫలమవుతున్నారని తెలుస్తోంది. ఇందులో వాటర్‌షెడ్ పీఓ, ఏపీఓ, టీఓ, సీఓలకు సంబంధించిన క్రిమినల్ కేసులు నమోదు కాగా.. రూ.1.93 కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ఏపీఎం నుంచి ఒక కేసుకు సంబంధించి రూ.1.08 కోట్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ నుంచి మూడు కేసులకు రూ.1.03 కోట్లు, గ్రామైక్య సంఘం సహాయకుల నుంచి మూడు కేసులకు గాను రూ.97.64 లక్షలు సొమ్మును రికవరీ చేయాల్సి ఉంది.



బూదగవి వద్ద ఉపాధి నిధులతో తవ్విన ఈ ఫారంపాండ్లకు.. వాటర్‌షెడ్ కింద బిల్లులు చేసుకున్నారు

బూదగవి, గోళ్ల వాటర్‌షెడ్లలో ఇష్టానుసారం బిల్లులు

ఉరవకొండ నియోజకవర్గంలోని బూదగవిలో సుమారు రూ.90 లక్షల బిల్లులు చేయగా ఇందులో సగం కూడా పనులు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పథకం కింద చేసిన ఫారంపాండ్లను నల్లరేగడి నేలల్లో వాటర్‌షెడ్ కింద కూడా బిల్లులు చేసుకున్నట్లు సమాచారం. కళ్యాణదుర్గం మండలం గోళ్ల పంచాయతీ వాటర్‌షెడ్‌లోనూ ఇదే పరిస్థితి. రాప్తాడు మండలం హంపాపురంలో ఒక్కో పనికి రెండు సార్లు బిల్లులు పెట్టారనే విమర్శలు ఉన్నాయి. శింగనమల మండలం వెస్ట్‌నరసాపురం, తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామ వాటర్‌షెడ్లలోనూ చేయని పనులకు, ఉపాధి పథకం కింద చేసిన పనులకు బిల్లులు చేశారని సమాచారం.

ప్రతి పైసా లెక్కిస్తాం

వాటర్‌షెడ్ ప్రాజెక్టుల్లో చేపట్టిన ప్రతి పనికి వెచ్చించిన ప్రతి పైసా లెక్కిస్తాం. ఎక్కడైనా సరే లెక్క తప్పితే కచ్చితంగా సంబంధిత సిబ్బంది లేదా పనిచేసిన వారి నుంచి రికవరీ చేస్తాం. వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌లో మొత్తం పనిలో 10 శాతం నిధులు హోల్డ్‌లో ఉంటాయి. పూర్తి పనికి సంబంధించిన వివరాలు, రికార్డులు అందజేసినప్పుడే ఆ నిధులు చెల్లిస్తాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. ప్రభుత్వ సొమ్ముకు జవాబుదారిగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. గతంలో చేసిన పనులపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం.

-సలీం బాషా, పీడీ, డ్వామా



గరుడ వాహనంపై స్వామి వారు

వైభవంగా నారసింహుడి కల్యాణం

ఉరవకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ, గరుడ, గో వాహనోత్సవం, హనుమద్వాహన సేవలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను వాహనాలపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి, అర్చకులు ద్వారకనాథాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని చేపట్టారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

క్రైం కార్నర్

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ


ఆలయంలో హుండీని పగలకొట్టిన దృశ్యం

రామగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన ముత్యాలమ్మ ఆలయంలో హుండీని పగలకొట్టి దుండగులు చోరీ చేశారు. ఆలయ ఈఓ వెంకటేశులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... సోమవారం రాత్రి 10:30 గంటలు దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీని పగలకొట్టి అందులో ఉన్న మొత్తాన్ని, వస్తువులను ఎత్తుకెళ్లారు. నవంబరు 23 తర్వాత హుండీ ఆదాయాన్ని లెక్కించలేదు. దాదాపు రూ.1.5లక్షల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ముఖానికి మాస్కు ధరించి ఆలయం లోకి చొరబడినట్లు సీసీకెమెరాలో నమోదైందన్నారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

యువతి అదృశ్యం


శిరీష (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ యువతి అదృశ్యమైంది. ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన మల్లెల శిరీష కొన్ని రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలంలోని పిల్లిగుండ్ల కాలనీలో నివాసముంటున్న తన పెద్దమ్మ వాళ్లఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం శిరీష ఇంటి నుంచి అదృశ్యమైంది. మంగళవారమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈక్రమంలోనే తండ్రి రామాంజనేయులు అనంతపురం రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులు..

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదం ఆడి, అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన శంకర్(29) గతంలో టీవీఎస్ ఫైనాన్స్ విభాగంలో పని చేసేవాడు. ఐదేళ్ల కిందట ఇతడికి స్రవంతి అనే యువతితో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. శంకర్ గత కొంతకాలంగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడేవాడు. ఈ క్రమంలో రూ.లక్షల్లో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు అధికం కావడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ ఉచ్చులో పడి మోసపోయిన రైతు

బెళుగుప్ప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన పురుషోత్తమ్ అనే రైతు మంగళవారం రూ. పది వేలు పోగొట్టుకున్నాడు. వివరాలు ఇలా రైతు పురుషోత్తమ్‌కు మంగళవారం ఉదయం ఓ నెంబరు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు భార్గవ్ అని, బెంగళూరులో బీటెక్ చదువుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. అనంతరం తనకు యాక్సిడెంట్ జరిగిందని, హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపాడు. ఆస్పత్రి ఖర్చులకు డబ్బు తక్కువ వచ్చిందని, అత్యవసరంగా రూ.30వేలు పంపమని కోరాడు. 8864054661 నెంబర్‌కు ఫోన్‌పే చెయ్యమన్నాడు. తన వద్ద అంతడబ్బులేదని, రూ.పది వేలు మాత్రమే ఉందని పంపారు. తర్వాత పురుషోత్తం తన కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపాడు. వారు అనుమానంతో ఫోన్ చేసి ఆరా తీయగా భార్గవ్ కాలేజీలో ఉన్నట్లు తెలిసింది. పురుషోత్తంకు ఫోన్‌కాల్ వచ్చిన 9100493361 నెంబర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. బాధితుడు పోలీసులను సంప్రదించగా 1930కు ఫిర్యాదు చేయమని సూచించారు.

నేడు తుది విడత ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు బుధవారం తుది విడత ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 121 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాల నూతన పాలక వర్గం ఎన్నికలకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా స్థానిక వెటర్నరీ డాక్టర్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి దాకా మూడు విడతల్లో 107 సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా.. తగిన రికార్డులు లేకపోవడంతో 20 సంఘాల ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఆ సంఘాలకు త్వరలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించి, ఎన్నికలు నిర్వహించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

పట్టాలు తప్పిన గూడ్సు వ్యాగన్లు

పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం


పట్టాలు తప్పిన గూడ్సు రైలు

గుంతకల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గూడ్సు రైలు పట్టాలు తప్పింది. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. తోరణగల్లు నుంచి వచ్చిన గూడ్సు రైలు డీఆర్‌ఎం కార్యాలయానికి ఎదురుగా సౌత్ కేబిన్ సమీపంలో వంతెన దాటిన తర్వాత మంగళవారం సాయంత్రం 5-45 గంటల ప్రాంతంలో పట్టాలు తప్పింది. 13, 14 నంబర్ల వ్యాగన్లు డీ రైల్ అయ్యాయి. ఈ ప్రమాదం విజయవాడ, చెన్నై లైన్లకు సమీపంలో జరగడంతో రెండు మార్గాల నుంచి వచ్చే రైళ్లకు అంతరాయం ఏర్పడింది. గూడ్సు వ్యాగన్ విజయవాడ లైన్‌లోకి వెళ్లడంతో ఆ మార్గంలో ఉన్న రెండు రైళ్లకు సమస్య ఏర్పడింది. వాస్కో-హౌరా ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోయిన తర్వాత ఈ గూడ్సు పట్టాలు తప్పడంతో వెంటనే వచ్చిన అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను కాసేపు నిలిపివేశారు. ఇంజన్‌ను బోగీల రెండో చివర బిగించి డీఆర్‌ఎం కార్యాలయం వైపు కాకుండా బైపాస్ లైన్‌లో మళ్లించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను ముందు స్టేషన్‌లో నిలిపివేశారు. రెస్టోరేషన్ పనులు రాత్రి 8.30 గంటల వరకూ కొనసాగాయి. చెన్నై నుంచి రాత్రి వచ్చిన చెన్నై-ముంబై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గంటసేపు ఆలస్యంగా నడిచింది.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.8 పలికినట్లు ఆయన తెలిపారు.

బకాయిలు పెట్టి.. పోరుబాటా..?

అధికారం ఉన్నపుడు విద్యార్థులను విస్మరించిన వైసీపీ

- ఉత్తుత్తి బటన్లు నొక్కిన జగన్‌రెడ్డి
- రూ.కోట్ల ఫీజులు పెండింగ్
- అధికారం పోగానే ఫీజులపై పోరు
- మండిపడుతున్న విద్యార్థులు, సంఘాలు


పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నవ్విపోదురుగాక నాకేటి అన్నట్లుంది వైసీపీ తీరు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ గతాన్ని మరచిపోయింది. విద్యార్థులు పడే కష్టాలు, సమస్యలను విస్మరించింది. ప్రభుత్వం బాధ్యతగా చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాలను జగన్ రెడ్డి తన జేబులో నుంచి ఇస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో ప్రచారం చేసుకున్నారు. విడతల వారీగా ఏడాదికి నాలుగుసార్లు ఉత్తుత్తి బటన్లు నొక్కారు. డబ్బు జమకాకపోవడంతో కళాశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు సొంతంగా ఫీజులు కట్టాల్సి వచ్చింది. అధికారంలో ఉన్నపుడు పట్టించుకోని వైసీపీ.. దిగిపోగానే ఫీజు పోరుబాట పట్టడంపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు విస్మయం వ్యక్త చేస్తున్నాయి.

ఏడాదికి 54వేల మంది విద్యార్థులు

జేఎన్టీయూ ఆధ్వర్యంలో 120 ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎస్కేయూ ఆధ్వర్యంలో 80 డిగ్రీ, 17 పాలిటెక్నిక్ చొప్పున ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు, ప్రైవేటులో రూ.30వేల నుంచి రూ.70వేల వరకు ఏడాదికి ఫీజులు చెల్లించాలి. కళాశాలల్లో మౌలిక వసతుల ఆధారంగా, కోర్సుల వారీగా ఫీజులు నిర్ధారించారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీటెక్‌లో సివిల్, మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్, ఫుడ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులతోపాటు బీఫార్మసీ, పాలిటెక్నిక్ మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్, టెక్స్‌టైల్, కంప్యూటర్ సైన్స్ డిప్లొమో ఇంజనీరింగ్ కోర్సులున్నాయి. ప్రవేశ పరీక్షల ద్వారా పాలిటెక్నిక్‌లో 3వేలు, ఫార్మసీలో 4వేలు, డిగ్రీలో 17 వేలు, బీటెక్‌లో 30 వేల చొప్పున మొత్తం 50 వేలమంది వరకు విద్యార్థులు ఏటా ప్రవేశాలు పొందుతున్నారు.

రూ.వెయ్యి కోట్లు చెల్లించాలి

పాలిటెక్నిక్, డిగ్రీ మూడేళ్ల కోర్సులు. బీటెక్, బీఫార్మసీ నాలుగేళ్ల చొప్పున కోర్సు కాలం ఉంటుంది. ప్రవేశ సంవత్సరం నుంచి కోర్సు కాలం పూర్తయ్యే వరకు అర్హులైన పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే చెల్లించాలి. ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం దాదాపు రూ.150కోట్లు ఉంటుంది. ఒక్కో విద్యార్థికి హాస్టల్ ఫీజు రూ.10వేల చొప్పున మొత్తం 50 వేల మందికి రూ.50కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన వైసీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్లకుగాను రూ.వెయ్యి కోట్లు విద్యార్థులకు అందాలి. జగన్‌మోహన్ రెడ్డి సీఎం కాగానే.. పీజీ ద్వారా ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఎమ్మెసీ వంటి కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లింపులను ఎత్తివేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే వారికి మాత్రమే ఇస్తామని ప్రత్యేక జీఓ జారీ చేశారు.

ఉత్తుత్తి బటన్లు

ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని జగన్‌మోహన్ రెడ్డి తన జేబులో నుంచి ఇస్తున్నట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు జగనన్న విద్యాదీవెనగా, స్కాలర్‌షిప్‌నకు జగనన్న వసతి దీవెనగా పేర్లు మార్చారు. ఏడాది ఫీజు మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉండగా.. విడతల వారీగా విభజించారు. ప్రతి విడతకు జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నిధులను మంజూరు చేసేవారు. ఇలా సంవత్సరానికి నాలుగు విడతలుగా బటన్ నొక్కినా నిధులు మాత్రం తమ తల్లుల ఖాతాల్లో జమ కాలేదని విద్యార్థులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉత్తుత్తి బటన్లు నొక్కి ఐదేళ్లు మాయ చేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జేబులు గుల్ల చేసిన జగన్

విద్యార్థుల ఫీజులను కళాశాలకే చెల్లించే పద్ధతికి వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని అప్పటి పాలకులు బటన్లు నొక్కారు. దీంతో కళాశాలలు, ప్రభుత్వానికున్న విద్యార్థుల ఫీజుల బంధం తెగిపోయింది. ప్రభుత్వం తమకు చెల్లించకున్నా కళాశాలల యాజమాన్యాలు మాత్రం ముక్కు పిండి వసూలు చేశాయని విద్యార్థులు గుర్తుచేసుకుంటున్నారు. బటన్లు నొక్కి విడుదల చేసిన మొత్తాలు తమ తల్లుల ఖాతాల్లో జమకాలేదని ఆవేదన చెందుతున్నారు. ఏడాదికి నాలుగుసార్లు బటన్ నొక్కితే ఒకట్రెండు బటన్లు మాత్రమే పనిచేశాయి. హాల్ టిక్కెట్లు తీసుకోవాలన్నా, పరీక్షలు రాయాలన్నా, ఫలితాలు చూడాలన్నా, సర్టిఫికెట్లు తీసుకోవాలన్నా కళాశాలలకు సొంతంగా ఫీజులు కట్టామనీ, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తమ తల్లిదండ్రుల జేబులు గుల్లచేసి వెళ్లారని మండిపడుతున్నారు.

సొంతంగా ఫీజు కట్టాం..



గత ప్రభుత్వం విద్యాదీవెన చెల్లించకపోవడంతో సొంతంగా ఫీజులు కట్టాం. హాస్టల్, కాలేజీ ఫీజు రెండూ చేతి నుంచే చెల్లించాం. పుస్తకాలు, మెటీరియల్, పరీక్షలు ఇలా అనేక రకాలుగా ఖర్చు చేయాలి. అదనంగా ఫీజుల భారం పడింది. గత ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఇంటి నుంచి తీసుకువచ్చి కట్టాల్సి వచ్చింది. పాత సంవత్సరం బకాయిలతోపాటు ఈ ఏడాది ఫీజులను ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తుందట.

- అజిత, పాలిటెక్నిక్ విద్యార్థిని

జేబులు గుల్ల చేశారు



ఉచితంగా చదవాల్సిన బీటెక్ ఇంజనీరింగ్‌కు డబ్బు చెల్లించనిదే సంవత్సరం పూర్తికావడం లేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజులు కన్నవారితో కట్టించి, జేబులు గుల్ల చేశారు. మూడేళ్లపాటు ఇదేతంతు కొనసాగింది. ప్రస్తుత సంవత్సరం మాత్రం ఇంకా ఫీజులు అడగడం లేదు. బ్యాంకుల్లో తెరిచిన తల్లుల ఖాతాలు ఖాళీగున్నాయి. విద్యార్థులకు సంబంధం లేకుండా కళాశాలకే ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందని అధికారులు చెప్పారు.

- వెంకటేష్ నాయక్, బీటెక్ విద్యార్థి

రూపాయి కూడా రాలేదు



ఫీజులకు సంబంధించి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. కళాశాల, హాస్టల్ ఫీజు కలిసి సంవత్సరానికి రూ.50 వేలు అవుతుంది. కూలి పనులు చేసి గతేడాది ఫీజులు కట్టాల్సి వచ్చింది. హాల్ టిక్కెట్లు తీసుకోవాలన్నా, పరీక్షలు రాయాలన్నా, ఫలితాలు చూసుకోవాలన్నా ఫీజులు ఎంత బాకీ ఉన్నారని చూసేవారు. సెమిస్టర్ ఫీజు పూర్తిగా కట్టినవారికే హాల్ టిక్కెట్లు ఇచ్చేవారు. ప్రస్తుత సంవత్సరం నుచి పరిస్థితులు మారాయి.

- వనజ, డిగ్రీ విద్యార్థిని

ఫీజులు ఎగ్గొట్టారు



చదువులకు సంబంధించిన ఫీజుల మొత్తాన్ని ఎగ్గొట్టారు. తల్లి ఖాతాలోకి జమచేస్తామని దరఖాస్తులు స్వీకరించారు. సచివాలయంలో ఇద్దరి వేలిముద్రలు వేయించుకున్నారు. బటన్ నొక్కి సంవత్సరంలో నాలుగు విడతలుగా చెల్లిస్తామని చెప్పారు. ఒక్క బటన్ కూడా పనిచేయలేదేమో డబ్బులే రాలేదు.

- ఎలియేజర్, డిగ్రీ విద్యార్థి

వైసీపీ మోసం చేసింది..



గత ఐదేళ్లు విద్యార్థులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులను తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తామని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్లు నొక్కారు. ఒకేసారి ఇవ్వాల్సిన మొత్తాన్ని ఏడాదికి నాలుగు విడతలు చేశారు. సమయానికి కరెక్ట్‌గా ప్రకటనలిచ్చి గట్టిగానే నొక్కాడు. డబ్బులు మాత్రం విద్యార్థుల తల్లుల ఖాతాలో పడలేదు. మళ్లీ మోసం చేసేందుకు వైసీపీ కొత్త నాటకాలకు తెరలేపింది. ఫీజులు చెల్లించకుండా దిగిపోయిన జగన్ మోహన్ రెడ్డి ఫీజు పోరుబాట చేపట్టడం హాస్యాస్పదం.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

అధికారం పోతేగానీ తత్వం బోధపడలేదు



సీఎంగా ఉండి బాధ్యతతో పనిచేయాల్సిన జగన్‌మోహన్ రెడ్డి పదవికే కళంకం తెచ్చారు. సాజావుగా సాగే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ప్రక్రియలకు వక్రభాష్యం చెప్పారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనగా పేర్లు పెట్టుకుని జోరుగా ప్రచారాలు చేసుకున్నారు. అదేస్థాయిలో ఫీజుల మొత్తాలను ఇవ్వకుండానే వెళ్లిపోయారు. అధికారం పోతేగానీ తత్వం బోధపడలేదు. ఐదేళ్లపాటు విద్యార్థి సంఘాలు రోడ్లెక్కి ఫీజుల కష్టాలు వివరించినా పెడచెవిన పెట్టారు. కూటమి ప్రభుత్వమైనా కళ్లు తెరవాలి.

- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

అధికారం మత్తులో కనబడలేదు



పిల్లలను ఉన్నత చదువులు చదివించాలంటే తల్లిదండ్రులు ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అలా కూడబెట్టిన ప్రతిపైసా పుస్తకాలు, బ్యాగులు ఇలా విద్యావసరాలకే ఖర్చు చేస్తారు. గత ఐదేళ్ల అధికారం మత్తులో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి, వైసీపీకి తల్లిదండ్రుల కష్టాలు కనబడలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం చెల్లించకపోవడంతో అనేకమంది విద్యార్థులు భవిష్యత్తును కోల్పోయారు. కలెక్టరేట్, కళాశాలలను ముట్టడించినా కనికరించలేదు. వైసీపీ గతాన్ని గుర్తు చేసుకుని, పోరుబాట పట్టాలి.

- కమతం బాలకృష్ణ, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి

లైనింగ్ అంటే సీమ రైతులకు ఉరితాడే

- హంద్రీనీవా కాలువ 10వేల క్యూసెక్కులకు పెంచాలి
- సీఎం దృష్టికి సీమ రైతుల పరిస్థితి
- ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ నిర్మాణం చేపట్టడం సీమ రైతులకు ఉరితాడు బిగించడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. హంద్రీనీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయరాదని, కాలువ సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ నిరసనకు ముఖ్య అతిథులుగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ రాయల సీమకు వరప్రదాయినిగా ఉన్న హంద్రీనీవాకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ వేయడం మానుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా, 10వేల క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువ వెడల్పు చేయాలన్నారు. హంద్రీనీవాకు శ్రీశైలం డ్యాం నుంచి కనీసం 80 టీఎంసీల నీటిని కేటాయించాలని డిమాండ్ చేశారు. లైనింగ్ సమస్యను రాయలసీమ రైతుల తరఫున సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జగదీష్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వాన్ని మేలుకొలుపే నిరసన అని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ జిల్లాకు ప్రధాన నీటి వనరులైన హెచ్చెల్సీ, హంద్రీనీవాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని, వెంటనే లైనింగ్ పనులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమాం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా కాలవ సామర్థ్యం పెంచి, డిస్ట్రిబ్యూటరీలు నిర్మించి రైతులను ఆదుకోవాల న్నారు. అనంతరం హంద్రినీవా సీనియర్ ఈఈ రాజా స్వరూప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాజారెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు నాగరాజు, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా సంఘం వెంకటలక్ష్మి, వృత్తిసంఘాల సమాఖ్య నాయకులు రామాంజనేయులు, సీపీఎం నాయకులు రామిరెడ్డి, వెంకటనారాయణ, లింగమయ్య, పద్మావతి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రపంచానికి అనంత పంట

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. వీటికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించేలా, జిల్లా ఉద్యాన రైతులకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌ను ఏర్పాటు చేసింది. జిల్లా ఉద్యాన ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్రచారం, మౌలిక వసతుల కల్పన, మార్కెటింగ్‌లో పోటీ తత్వాన్ని పెంచడం, రైతులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం, రెండు అంకెల ఆదాయాన్ని రైతుకు కల్పించడం ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశం. అనంత ఉద్యాన సమ్మేళనంలో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారు. జిల్లా యంత్రాంగం మూడు కార్పొరేట్ ప్రతినిధులతో ఎంఓయూ కుదుర్చుకోనుంది.



తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో బనానా రైలును ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా, కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

చంద్రబాబు చొరవతో..

జిల్లా అరటి రైతులు టన్నుకు రూ.5వేలు కూడా లభించక 2016-17 ఏడాది నష్టపోయారు. అప్పటి సీఎం చంద్రబాబు చొరవచూపి.. ఐఎన్ఐ, దేశాయ్ తదితర కంపెనీలతో ఒప్పందాలు కుదిరేలా చేశారు. 'బనానా ఫ్రూట్ కేర్ యాక్టివిటీ' పరిజ్ఞానాన్ని జిల్లాకు తెచ్చారు. తద్వారా 30 కంపెనీలు అరటి ఎగుమతికి పోటీ పడ్డాయి. టన్ను అరటికి రూ.25 వేలకు తగ్గకుండా ధర లభించింది. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల ఆదా

భలే గిరాకీ..

2018-19లో మొట్టమొదటి సారి జిల్లాలో ఫ్రూట్ కేర్ యాక్టివిటీ మొదలైంది. జిల్లాలో 10,496 హెక్టార్లల్లో అరటిసాగవుతోంది. ఎక్కువ శాతం పుట్లూరు, యల్లనూరు, యాడికి, నార్పల, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో ఉంది. ఏటా 8.31 లక్షల మెట్రిక్ టన్నుల అరటి దిగుబడి వస్తోంది. టిష్యూకల్చర్‌తో తయారు చేసిన జీ - 9 రకం అరటిని జిల్లాలో సాగు చేస్తున్నారు. డ్రిప్ పద్ధతిలో నీరు, ఎరువులు ఇస్తుండటంతో నాణ్యమైన అరటి వస్తోంది. సాగు పద్ధతిపై కంపెనీల ప్రతినిధులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. తద్వారా అనంత అరటికి గిరాకీ పెరిగింది. జిల్లాలో అరటి కొనుగోలు చేసేందుకు 15 కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఆరేళ్లలో పది కంపెనీల ద్వారా 1.59 లక్షల మెట్రిక్ టన్నుల అరటిని రైతులు ఎగుమతి చేశారు. ఇరాన్, సౌదీ అరేబియా, ఖతార్, దుబాయ్‌కి అనంత అరటి తరలింది. 2018లో 18,500 మెట్రిక్ టన్నులు, 2019లో 23వేల మెట్రిక్ టన్నులు, 2020లో 43వేలు, 2021లో 61వేలు, 2022లో 63వేలు, 2023లో 63వేలు మెట్రిక్ టన్నుల అరటి విదేశాలకు ఎగుమతి అయింది.

యం సమకూరుతోందని ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు. అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌కు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వ్యవసాయం, కో-ఆపరేటివ్ సొసైటీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గల్ఫ్ దేశాలకు..

తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ఈ ఏడాది నవంబరులో గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతి ప్రారంభమైంది. పెద్దపప్పూరు, పుట్లూరు, యాడికి మండలాల్లోని 45 మంది రైతులు పండించిన రూ.1.50 కోట్ల విలువైన 680 మెట్రిక్ టన్నుల అరటిని కు 34 కంటైనర్లల్లో (బనానా రైలు) పంపించారు. వైసీపీ హయాంలో 2020 జనవరిలో కిసాన్ రైలు ద్వారా అరటితోపాటు ఇతర ఉద్యాన పంటలు ఢిల్లీకి పంపారు. ఆ తరువాత కిసాన్ రైలు ఆగిపోయింది. ప్రభుత్వంతో ఒప్పందం కుర్చుకున్న కంపెనీలు అరటి పంటను లారీల ద్వారా తరలించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి 'బనానా రైలు' మొదలైంది. ఎస్‌కే బనానా కంపెనీ ద్వారా తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ముంబాయికి అరటిని పంపింది.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతుండగా ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లిన వైసీపీ నేత


ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లడంతో ఖాళీగా కనిపిస్తున్న దిమ్మె

కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్ల గ్రామ సమీపంలో జగనన్న కాలనీకి అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నేత ఎత్తుకెళ్లి తన వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆ రైతులు, గ్రామస్థులు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి మంగళవారం తీసుకెళ్లారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వరనాయక్‌ను వివరణ కోరగా... గ్రామస్థులు ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లిన విషయం తన దృష్టికి తీసుకువచ్చారని, బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను యథాస్థానంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లడం నేరమని, ఆయనపై శాఖా పరమైన చర్యలు కూడా ఉంటాయని అన్నారు.

కన్నుల పండువగా రథసప్తమి

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామిని మంగళవారం గంటకో వాహనం చొప్పున.. ఏడు వాహనాల్లో కొలువు దీర్చి.. పుర వీధుల్లో ఊరేగించారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ తిరుమలలో లాగా ధర్మవరం పట్టణంలోనూ రథసప్తమి నాడు స్వామి వారిని ఒకే రోజు ఏడు వాహనాల్లో ఊరేగించేలా చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పోరాళ్లపల్లి య్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వెంకటేశ్వరుడికి పట్టువస్త్రాలు, వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు జింకా రాజేంద్రప్రసాద్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.


శేష వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు


సూర్యప్రభ వాహనంపై..

ప్రజాసమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఓబులదేవరచెరువు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే సింధూరా రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం అమడగూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్యసమావేశాన్ని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని.. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, మురుగునీటి వసతులపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలన్నారు. ఉపాధి పథకంలో పనులు చేయనివారికి కూడా బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై దృష్టిసారించి, నిజంగా పనులు చేసే కూలీలకు డబ్బులు అందేలా చూడాలని ఏపీఓ అమరావతికి ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● టీడీపీ కార్యకర్తకు నివాళి: ఓడీసీ మండ లంలోని వేమారెడ్డిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త మలక రామచంద్రారెడ్డి అనారోగ్యంతో మరణించారు. ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి.. ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. ఆమె వెంట గోపినాథ్‌రెడ్డి, మలక వాసురెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి భక్తులు మండలంలోని బండ్లపల్లి, తలమర్ల, కొడపగానిపల్లి, కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలల్లోని 1500 మంది విద్యార్థులకు రూ. 4.50 లక్షల విలువైన విద్యా సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. చైనీస్ డే సందర్భంగా సింగపూర్ దేశానికి చెందిన సాయి భక్తులు వీటిని పంపిణీ చేశారు.


విద్యార్థులకు స్టేషనరీ అందిస్తున్న విదేశీయులు

శుద్ధజల కేంద్రం ప్రారంభం


వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్

కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుకుంటపల్లి గ్రామంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంటును సత్యసాయి భక్తులు ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంటును ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని, తాగునీటిని వృథా చేయరాదని ఆయన సూచించారు. కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఏకగ్రీవం

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా జనార్దన్, సెక్రటరీగా మస్తాన్‌వలి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగభూషణం తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

న్యూస్ బాక్స్


ముఖ్యమంత్రికి సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు

ధర్మవరం/కదిరి అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్ర వ్యాపారులు, బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రముఖులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం విజయవాడలో సీఎం చాంబర్‌లో సీఎంను ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులు గిర్రాజురి, నీలూరి శీన, శశి, హేమంత్, రమణ, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు కలిసి పలు సమస్యలను విన్నవించారు. వస్త్రవ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలోనే కమిటీని నియమించి, విధివిధానాలను రూపొందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

కదిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కోరారు. మంగళవారం విజయవాడలో మంత్రిని ఆయన కలిశారు. ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రెన్యువల్‌ను 10 సంవత్సరాలకు పెంచాలని, ఫైర్ సర్టిఫికెట్‌ను 5 సంవత్సరాలకు పొడిగించాలని, 10 పరీక్షలు గణితం తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టులకు గీతలున్న సమాధాన పత్రాలు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, చిరంజీవి, అశోక్‌బాబు, ప్రైవేటు పాఠశాల సంఘం నాయకులు రవిచంద్రారెడ్డి, సింగారెడ్డి ఉన్నారు.


నారాలోకేశ్‌తో అనిల్‌కుమార్‌రెడ్డి

సామూహిక సూర్య నమస్కారాలు


ధర్మవరం: సూర్యనమస్కారాలు చేస్తున్న దృశ్యం

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా స్థానిక మార్కెట్‌యార్డ్‌లో మంగళవారం ఉదయం వివేకానంద యోగ కేంద్రం యోగా గురువు గొల్లనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక యోగా కేంద్ర గౌరవ అధ్యక్షుడు గుండు వేణుగోపాల్, అధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డి, యోగా ఆర్గనైజర్ నరసింహులు పాల్గొన్నారు.
● ముదిగుబ్బ: స్థానిక శాంతి ఆనంద పాఠశాలలో మంగళవారం సూర్య నమస్కారాలతో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో యోగా టీచర్లు ప్రభావతి, సరస్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొగ్గు రాజశేఖర్, శాంతి ఆనంద ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ తుమ్మల చంద్రమోహన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ల వాడకంపై అవగాహన ర్యాలీ


బైకు ర్యాలీలో ఎస్పీ రత్న, మహిళలు, విద్యార్థులు

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ వి.రత్న ఆధ్వర్యంలో పట్టణంలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, మహిళా పోలీసులు, విద్యార్థినులు హెల్మెట్ వాడకంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ రాణి, డీఎస్పీ హేమంత్‌కుమార్, టైనీ డీఎస్పీ ఉదయపావని, సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ఎస్సైలు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: జేసీ

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ధరకంటే ఎక్కువ ధరలకు గ్యాస్ సిలిండర్లు అమ్మితే సంబంధిత ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హెచ్చరించారు. దీపం పథకం-2 అమలుపై జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలువురు గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి రూ.80 నుంచి 150 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదు వస్తున్నాయని పేర్కొన్నారు. వినియోగదారులనుంచి వచ్చిన ఫిర్యాదుల నిజమని తేలితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుని బ్లాక్ లిస్టులో పెడతామని, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఈబీసీ కేటగిరికి చెందిన 21 నుంచి 60 సంవత్సరాల వారు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా వెబ్‌సైట్‌లో ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

11న అరుణాచలానికి బస్సు

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా ధర్మవరం నుంచి ఈనెల 12న అరుణాచలం, కాణిపాకానికి ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ధర్మవరం డిపో నుంచి ఈనెల 11న ఉదయం 6గంటలకు బయలు దేరుతుందన్నారు. రానుపోను చార్జీ రూ.1400 ఉంటుందన్నారు. కావున దర్శనానికి వెళ్లే భక్తులు ముందుగానే ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 63031 51302, 99592 25859 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రిన్సిపాల్‌గా దామోదర్ బాధ్యతల స్వీకరణ



కదిరిఅర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్‌గా దామోదర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గత ప్రిన్సిపాల్ హరేంద్ర ప్రసాద్ గత నెల 22న మరణించడంతో.. కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న దామోదర్‌ను ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ)గా నియమించారు.

డీఎస్పీకి సన్మానం

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోంలో ధర్మవరం డివిజన్ ఏపీయూడబ్ల్యూజే కమిటీ సభ్యులు నూతన డీఎస్పీ హేమంత్ కుమార్‌ను మంగళవారం సన్మానించారు. పోలీసులు, పాత్రికేయులు ఫ్రెండ్లీగా ఉంటూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడుకుందామని డీఎస్పీ సూచించారు. డివిజన్‌లో ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

అయ్యప్ప గుడికి విరాళం

గాండ్లపెంట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి, రాయచోటి ప్రధాన రహదారి చిన్నపట్టివడ్డ నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప గుడికి మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి రూ.50,116 విరాళాన్ని మంగళవారం అందించారు. అయ్యప్ప భక్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి


గనీసాబ్ (ఫైల్)

నల్లమాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు హోటల్ గనీసాబ్ (80) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆ గ్రామానికెళ్లి మృతదేహానికి నివాళ్లు అర్పించారు. ఆమె వెంట జన్సేనర్ మైలే శివశంకర్, మాజీ జన్సేనర్ కేశవరెడ్డి, వెంకట రమణ నాయుడు, గంగులప్ప నాయుడు, పెద్దప్పయ్య నాయుడు, అంజనేయులునాయుడు ఉన్నారు.

పాఠశాల హెల్పర్‌పై చర్యలు తీసుకోండి

నంబులపూలకుంట, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కోడిగుడ్లు, బియ్యం, హార్లిక్స్ సీసాలను స్వాహా చేసిన హెల్పర్ అమీన్‌పీరాపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతి పత్రం అందచేశారు. చోరీకి పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మండల మైనార్టీ మోర్చా చాంద్ బాషా, మరికొమ్మెదిన్నె రమణ, జిల్లా జనరల్ సెక్రటరీ శివారెడ్డి ఉన్నారు.

పాత భవనం కూల్చివేతకు వినతి

ఓబులదేవరచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పాత భవనం స్థానంలో దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రం నిర్మించడానికి ఆర్టీటీ నుంచి ముందుకువచ్చింది. దీంతో పాత భవనం కూల్చివేతకు ఎంఈఓ సురేశ్‌బాబు, ఉపాధ్యాయులు మంగళవారం ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌కు వినతిపత్రం అందచేశారు. పాత భవనం కూల్చివేసి, అందులోని రాళ్లు, ఇనుప కడ్డీలతో బహిరంగ వేలం వేయడానికి ఎంపీడీఓ అనుమతి కోరారు. ఆసక్తిగలవారు శుక్రవారం ఉదయం 10గంటలకు రూ.ఎదు వేలు దరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

వీధుల్లో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బీసీ కాలనీలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

కొత్తచెరువు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎక్కడ చూసినా చెత్తదిబ్బలే దర్శనమిస్తున్నాయి. బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన కొన్ని నెలలుగా చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన పంచాయతీ అధికారులు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్మికులతో మంగళవారం తొలగించారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టలో ఉంచుకోవాలని, ప్రతిరోజు వీధుల్లోకి వచ్చే చెత్త సేకరణ ట్రాక్టర్లలోకి వేయాలని ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూచించారు. త్వరలోనే మండల కేంద్రంలోని వీధుల్లో చెత్తకుండీలను ఏర్పాటు చేస్తామన్నారు.

50 సంవత్సరాల తర్వాత సమావేశం

కదిరి అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1973-74లో పదో తరగతి చదివిన విద్యార్థులు.. సుమారు 50 సంవత్సరాల తర్వాత సమావేశమయ్యారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు ఆత్తార్ మహబూబ్‌పాషా, రామలింగయ్య, ఎస్ఎండీ బాషా, రజిమ్ముల్లా, శ్రీనివాసులు, ఎల్‌రెడ్డి, కాటం వీరనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, అజుతుల్లాఖాన్ పాల్గొన్నారు.


సమావేశమైన నాటి విద్యార్థులు

క్రైం న్యూస్..

రెండు ఆవులు, దూడ అపహరణ

కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇండ్లవెం కటంపల్లి సమీపంలో వ్యవసాయ పొలం వద్ద షెడ్‌లో కట్టివేసిన రెండు పాడి ఆవులు, ఒక దూడను దుండగులు సోమవారం అర్ధ రాత్రి అపహరించారు. ఇటీవల రూ.2 లక్షలు వెచ్చించి ఆ రెండు పాడి ఆవులను కొనుగోలు చేసినట్లు బాధిత రైతు వలీంద్రరెడ్డి తెలిపారు. ఒక్కో ఆవు రోజుకు 15 లీటర్ల పాలు ఇచ్చేవని, ప్రతి రోజు లాగానే ఆవుల పాలు పిండి యధావిధిగా సోమవారం సాయంత్రం షెడ్‌లో కట్టేసినాన్నని, తిరిగి మంగళవారం తెల్లవారు జామున రాగా.. షెడ్‌లో ఆవులు కనిపించలేదని వాపోయాడు. దీంతో కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

వేధింపుల కేసు నమోదు

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అత్తింటివారు కట్నం, ఆడపిల్లలు పుట్టారని తరచూ వేధింపులకు గురిచేసిన విషయంపై ఐదు గురిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. కేతిరెడ్డికాలనీకి చెందిన హరితను అత్తింటివారు అదనపు కట్నం, ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని తరచూ వేధిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తనను వేధింపులకు తాళలేక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఆమె భర్త రమేశ్ నాయుడు, అత్త లక్ష్మీదేవి, మామ నారాయణ, మరిది కోటేశ్వరరావు, ఆడపడుచు రాజేశ్వరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కందిపంట దగ్ధం

కదిరి అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసు నాయక్ తండాలో నిప్పు అంటుకుని లాలూనాయక్ ఎకరాలో సాగుచేసిన కందిపంట మంగళవారం దగ్ధమైంది. సమీప పొలానికి చెందిన రైతు తన పొలంలో నిప్పు అర్పించడంతో ఆ మంటలు తన పొలంలోకి వ్యాపించి. కంది పంట దగ్ధమైందన్నారు. విద్యుత్ మీటర్, డ్రిప్ వైర్లు కూడా కాలిపోయినట్టు చెప్పారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి: డీఎంహెచ్ఓ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలని, అప్పుడే నివారణ సులభతరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఫైరోజాబేగం తెలిపారు. మంగళవారం స్థానిక ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ నిర్వహించారు. ఆశా కార్యకర్తలు ప్రజలకు అందించే సేవలు, మాతాశిశు సంరక్షణ, వ్యాధినిరోధక టీకాలు, అంటువ్యాధులపై ఆరా తీశారు. అనంతరం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభతరం మవుతుందని, ఆ దిశగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి వైద్య సిబ్బంది ఇంటింటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియో గించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జోత్స్న, మునిచంద్రిక, భవ్య, సామాజిక ఆరోగ్య అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం

బాధిత రైతుకు ఆర్థికసాయం

తాడిమర్రి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికాకుల పల్లి గ్రామంలో రైతుకు మల్లన్నకు సంబంధించిన డ్రిప్, స్ప్రింకర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ రైతు పొలాన్ని మంగళవారం పరిశీలించారు. రైతుకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తిరుపాలు, నారాయణస్వామి, ఈశ్వరయ్య, సత్యం పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టండి

నల్లచెరువు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఆశకార్యకర్తలు కుష్ఠు వ్యాధి, బీపీ, షుగర్, థైరాయిడ్ బాధితులను గుర్తించడానికి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా డెమో బాలాప్రభుద్దిన్ సూచించారు. స్థానిక ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశకార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సర్వేలో సచివాలయ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి కల్పన, ఆశకార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కల్యాణ మహోత్సవాలు

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు శ్రీభద్రావతి భావనా రుషీంద్రుల స్వామి కళ్యాణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పుత్తారుద్రయ్య, జింకానాగభూషణం కోరారు. ఈ మేరకు ఆ ఆలయంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. గురువారం గోపూజ, మహాగణపతిపూజ, బిందుసేవ, శుక్రవారం శ్రీభద్రావతి భావనా ఋషీంద్రుల స్వామి కళ్యాణోత్సవం, అన్నసంతర్పణ, శనివారం వసంతోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం పట్టణ ప్రధానకార్యదర్శి బాలు కుళ్లాయప్ప, సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. మంగళవారం కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధుర్య, సిబ్బంది పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



చంద్రశేఖర్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు

లేపాక్షి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వీరజవాన్ చంద్రశేఖర్‌రెడ్డి తోటి మిత్రులు, గ్రామస్థులు మంగళవారం ఆయనకు ఘన నివాళులు అర్పించారు. 15ఏళ్ల క్రితం కోడిపల్లి గ్రామానికి చెందిన సైనికుడు చంద్రశేఖర్‌రెడ్డి యుద్ధంలో వీరమరణం పొందాడు. ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం గ్రామస్థులు ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

దైవభక్తే.. ముక్తికి మార్గం



ప్రత్యేక అలంకరణలో రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మి

అగళి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దైవ భక్తితోనే మనిషికి ముక్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని జెడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. మంగళవారం గొల్లహట్టి, అనుమనపల్లి గ్రామాలలో రత్నగిరి కొల్లాపురమ్మ దేవి మహాలక్ష్మి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మూగడల్ బెట్టకరియమ్మదేవి జాతర ఉత్సవాలు కూడా జరిగాయి. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఐదేళ్లకోసారి ఈ గ్రామాలలో కొల్లాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు, టీడీపీ ఎంపీటీసీ చంద్రప్ప, చక్రప్ప, రఘు, ముద్దరంగప్ప తదితరులు తెలిపారు.

అందుబాటులో గుండెపోటు నివారణ ఇంజక్షన్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన వారికి అత్యవసరమైన చికిత్సలో భాగంగా ప్రభుత్వం రూ.40వేలు విలువ కల్గిన ఇంజెక్షన్‌ను మడకశిర వైద్యవిధాన పరిషత్‌లో అందుబాటులోఉంచినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖ తెలిపారు. అత్యవసర చికిత్సలో భాగంగా ఈ ఇంజెక్షన్ వేయడం వల్ల గుండెలోని రక్తనాణాలలో రక్తం గడ్డకట్టకుండా గుండెకు రక్తం సరఫరా జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో గుండెపోటు వచ్చినప్పుడు అత్యవసరంగా మడకశిర వైద్య విధానపరిషత్ ఆస్పత్రికి తీసుకురాగల్గితే చికిత్స ద్వారా వారికి ఉపశమనం లభిస్తుందన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్దమంతూరులో ఉట్ల పరుష



ఉట్లపరుష నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని పెద్దమంతూరు గ్రామంలో వైభవంగా ఉట్ల పరుష కార్యక్రమాన్ని నిర్వహించారు. సుబ్రమణ్యేశ్వరస్వామి షష్ఠిని పురస్కరించుకుని గ్రామంలో స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. అనంతరం జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామస్థులంతా కలిసి జాతర కార్యక్రమాన్ని తిలకించారు.

ఘనంగా ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

పరిగి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా మండలంలోని ధనాపురం ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ సుకన్య మాట్లాడుతూ మానవాళి మనుగడకు చిత్తడినేల ఎంతో అవసరమన్నారు. మానవుడు తమ ఆవాసాల కోసం వీటిని పూడ్చి గృహాలు నిర్మించడంవల్ల కనుమరుగవుతున్నాయన్నారు. వీటి ప్రాముఖ్యతను విద్యార్థులు సమాజంలో ప్రజలకు తెలియజేస్తే వాటిని పరిరక్షించడం సాధ్యం అవుతుందని ఆమె తెలిపారు. ఇకనైనా ప్రజలందరూ పర్యావరణం అంతరించిపోకుండా కాపాడుకోవడానికి ప్రయత్నం చేయాలని కోరారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, పీడీ మహేష్‌దీపక్ పాల్గొన్నారు.

శరీర ఎదుగుదలకు పోషకాహారం అవసరం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి, 4(ఆంధ్రజ్యోతి): శరీర అభివృద్ధికి, సూక్ష్మ పోషకాలు కలిగిన ఆహారం అవసరమని జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నాడు. మంగళవారం పట్టణపరిధిలోని లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిసిన ఆశాడే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఆయన మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారులతో పాటు ప్రతి వ్యక్తి ఆరోగ్యకరంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటయి పోతున్నారన్నారు. వాటిని తీసుకోవడం వల్ల శరీరానికి బలం చేకూరకపోగా నష్టం కలుగుతుందన్నారు.

ఐదేళ్లయినా అట్టడుగునే..

● మెళవాయి గ్రామంలో అడుగంటిన అభివృద్ధి
● పునాదులకే పరిమితమైన సచివాలయం
● నిరుపయోగంగా ప్రసూతి కేంద్రం



పునాదులకే పరిమితమైన గ్రామ సచివాలయ భవనం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయితీ కేంద్రమైన మెళవాయి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు గడిచినా మెళవాయి గ్రామం మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. పంచాయితీ కేంద్రంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైంది. నిధుల కొరత కారణంగా వాటి నిర్మాణాలకు వైసీపీ నాయకులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వచ్చిన సిమెంట్ బస్తాలు గడ్డకట్టి నిరూపయోగంగా మారిపోయాయి. ప్రస్తుతం ఉన్న గ్రామ సచివాలయాన్ని మహిళా సంఘ భవనాల్లో నిర్వహిస్తున్నారు. అందులో కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఇరుకు గదుల్లో సచివాలయ సిబ్బంది పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలు బయట నుంచి తమ బాధను, వినతులను వారికి చెప్పుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతు భరోసా కేంద్రానికి భవనాలు లేకపోవడంతో గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్నారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం మాత్రం నూతన సచివాలయ భవనాలతో గ్రామ రూపురేఖలు మారిపోయాయని గొప్పలు చెప్పుకున్నా తమ బాధలు ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంచాయితీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాలో జరగాల్సిన పనులు నిలిచిపోయాయి. గ్రామంలో డ్రైనేజీ లేక మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పంచాయితీ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో వారుకూడా పనులు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. దీంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామంలో ఉన్న ప్రసూతి కేంద్రంలో సరైన వసతులు లేకపోవడంతో ఆ కేంద్రం నిరుపయోగంగా మారింది. నాడు నేడు రెండవ విడత కింద పాఠశాలలకు సకాలంలో నిధులు రాకపోవడంతో పనులు అర్థాంతంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అయినా తమ గోడు పట్టించుకొని గ్రామంలో నిల్చిపోయిన పనులు పూర్తిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



గడ్డ కట్టుకుపోయిన సిమెంట్ బస్తాలు

ప్రకటనలేగాని.. అభివృద్ధి లేదు



వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో గ్రామాలను అభివృద్ధి చేసింది ఏమీలేదు. ప్రకటనలకే పరిమితం అయింది. నిర్మాణాల పేరుతో ఉన్నవి పడగొట్టి నిధుల కొరతతో వాటిని పునర్నిర్మించలేదు. ఏగ్రామంలో కూడా పూర్తి అభివృద్ధి పనులు జరగలేదు.

- గంగాధర్, మెళవాయి

ఆదిదేవ నమస్తుభ్యం.. ప్రసీద మమ భాస్కరం..!

● ఘనంగా రథసప్తమి పూజలు

సృష్టికంతటికీ కారణభూతుడైన సూర్యుని జన్మదినంగా చెప్పబడుతున్న రథసప్తమి పర్వదినాన్ని హిందూపురం, మడకశిరలలో అంతటా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల సూర్య నమస్కారాలు నిర్వహించగా, నాగలమడక లాంటి దేవస్థానాల్లో స్వామివారికి అభిషేకాలు, పూజలు జరిగాయి. మడకశిర మండలం నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కూడా సూర్య నమస్కారాల్లో పాల్గొన్నారు. గోరంట్ల పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల వద్ద సిద్ద సమాధియోగ ఆధ్వర్యంలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. మడకశిరలో పతంజలి యోగా శిక్షణ సమితి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ ఆవరణంలో సూర్య హోమంతోపాటు గణపతి నమస్కారాలు నిర్వహించారు. పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయ ఆవరణంలో అగ్నిగుండ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెనుకొండ పట్టణంలోని ఘనగిరి ప్రసన్న లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



సూర్య నమస్కారాలు చేస్తున్న రఘువీరారెడ్డి



నాగులమడకలో పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

రైతుల ఇంటి వద్దకే డ్రిప్ పరికరాలు



దుద్దేబండలో రైతుల చెంతకే వచ్చిన డ్రిప్ పరికరాలు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులకు డ్రిప్ పరికరాలు అందించడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. దీంతో డ్రిప్ ద్వారా పండించే రైతులు మార్కెట్‌లో అధిక ధరలకు వెచ్చించి డ్రిప్ పరికరాలు కొనుగోలుచేసి పంటలు పండించి నష్టపోయారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సబ్సిడీతో పరికరాలు అందుతాయని వేచివున్న రైతులకు నిరాశే మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు 90శాతం రాయితీతో డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు, పరికరాలు అందిస్తోంది. డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాల్లో నమోదు చేసుకున్న 15రోజుల్లోపు ఇంటివద్దకే నేరుగా పరికరాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఐదెకరాలుంటే 90శాతం, పదెకరాల్లోపుంటే 70శాతం, 10ఎకరాలుంటే 50శాతం సబ్సిడీతో పరికరాలు అందిస్తుందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్టాండుకు వీడని గ్రహణం

సోమందేపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండును గ్రహణం వెంటాడుతోంది. లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని వెచ్చించి దశాబ్దాల క్రితం నిర్మించిన బస్టాండు నిరుపయోగంగా మారింది. మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు రాత్రివేళల్లో నిలయంగా మారింది. ప్రయాణికులు రావడంలేదన్న నెపంతో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రెండెకరాల్లో 25ఏళ్ల క్రితం జిల్లాపరిషత్ హైస్కూల్ పక్కన ఆర్భాటంగా బస్టాండ్ నిర్మించారు. మొదట్లో కంట్రోలర్, సిబ్బందిని నియమించి బస్సులు నడిపారు. అయితే బస్టాండు ఊరిబయట ఉందని ప్రయాణికులు రావడానికి సుముఖత చూపకపోవడంతో నిర్వహణను గాలికి వదిలేశారు. ప్రస్తుతం పెద్దమ్మగుడిప్రాంతంలో బస్సులు నిలుపుతున్నారు. ప్రయాణికులు సైతం అక్కడే బస్సు ఎక్కి వెళ్తున్నారు.

ఇటీవల అనేక ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జిల్లా అధికారి ఆదేశాలతో బస్టాండు ఆవరణలో జంగిల్ క్లీనింగ్ చేపట్టారు. బోర్డు రాయించి ప్రారంభిస్తున్నట్లు ప్రకటనలు చేశారు. బస్టాండులో ఉన్న వాణిజ్య సముదాయాలకు టెండర్లు సైతం పిలిచారు. అయితే నేటి వరకు ఆదిశగా ఒక్క అడుగు సైతం పడలేదు. ప్రస్తుతం బస్టాండు పరిసరాల్లో జనావాసాలు, వాణిజ్యసముదాయాలు వెలిశాయి. పరిస్థితి బస్టాండుకు అనుకూలంగా మారింది. ఇప్పుడు ఈ ప్రాంతం ముఖ్యమైన ప్రాంతంగా మారింది. ఇప్పటికైనా బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలని, బస్సులు బస్టాండులో ఆగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న బస్టాండు

ఆప్కాస్ విధానంతో కార్మికులకు తీరని నష్టం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కాస్ విధానంతో మునిసిపల్ కార్మికులకు తీరని నష్టం కలుగుతుందని మునిసిపల్ కార్మికులు, సీఐటీయు పట్టణ నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు వారు మంగళవారం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ఆప్కాస్ విధానం వల్ల కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, చనిపోయిన కార్మికులకు కుటుం బాలకు ఉద్యోగం రాకపోవడంలాంటి అన్యాయాలు జరుగుతున్నా యన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మునిసిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకుపోయి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా హిందూపురం మునిసిపాలిటీలో కొంత కాలం క్రితం 10 మంది దాకా కార్మికులు మృతి చెందారన్నారు. వారికి ఎటువంటి డెత్ క్లెయిమ్‌లు అందలేదన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులను ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వకుండానే నిర్లక్ష్యంగా తొలగించారన్నారు. కార్మికులందరికి కనీసం రూ.32 వేలు జీతం అందించాలన్నారు. సుప్రీం కోర్టు చెప్పిన ప్రకారం సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని లేదా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పనిముట్లు, కొబ్బరినూనె, రక్షణ పరికరాలు ఇవ్వాలని శ్రీనివాసరావును కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకుడు రాము, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షుడు మల్లికార్జున, సహాయ కార్యదర్శి గురునాథ్, కోశాధికారి ఆనంద్ తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న మునిసిపల్ కార్మికులు

కాపర్లు పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

గుడిబండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాపర్లు తమ పశువులను రాత్రి వేళల్లో జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, దొంగలు కనబడితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని రైతులకు సూచించారు. పశువులను ఆరుబయట, పొలాల వద్ద కట్టేసి ఇంటిలో నిద్రించరాదన్నారు. పశువుల కాపర్లు మేకలు, గొర్రెలు, పాడి ఆవులు, గేదెలు, ఆవులు, ఎద్దులను ఇంటి పరిసర ప్రాంతాల్లో కట్టివేసి ఆరుబయట పడుకొని వాటికి కాపలా ఉండాలని సూచించారు.

చెరువు స్థలాల ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



మరవ కాలువ అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ

గోరంట్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రావతి పరివాహక ప్రాంతాలను కొందరు ఆక్రమిస్తుండడంతో వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డిఈ లక్ష్మీనారాయణ మంగళవారం తహసీల్దార్ మారుతికి ఫిర్యాదు చేశారు. గోరంట్లలోని రావికుంట చెరువుకు సంబంధించి నీటి కాలువను లేఅవుట్‌కోసం పూర్తిగా తొలగించారన్నారు.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరవ కాలువ స్థానంలో చిన్నపాటి రాతి కాలువ నిర్మాణాలు చేపట్టడంతో అధికారులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. దీంతోపాటు మల్లాపల్లి వద్ద చెరువుకు వెళ్లే కాలువపై పిల్లర్లతో ఇంటి నిర్మాణ జరుగుతోందని, అలాగే గోరంట్లలోని చిత్రావతి నది ఒడ్డున స్థలాలను ఆక్రమిస్తున్నారన్నారు. పాలసముద్రంలో ప్రార్థనా మందిరం కోసం చెరువు లోతట్టు ప్రాంతాన్ని ఆక్రమించారన్నారు. ఈసంఘటనలపై గతంలోనే రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని డిఈ తెలిపారు. అయినా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగిస్తుండడంతో డిఈతోపాటు విఆర్ఓ అశోక్‌లు రావికుంట కాలువ పనులను పరిశీలించారు. చర్యలకోసం మరోసారి తహసీల్దార్‌ను లిఖితపూర్వకంగా కోరినట్లు తెలిపారు.

ఘనంగా ఆంజనేయ స్వామి బ్రహ్మరథోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

గుడిబండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామస్తులు, భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొన్నారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ముందు జాగ్రత్తలతో కేన్సర్ నివారణ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి రాకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలే కీలమని ఎస్ఎస్‌పీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌రిబ్బన్‌క్లబ్, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన కేన్సర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని సూచించాడు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం అధికమైందని పట్టణాలతో పాటు పల్లెటూర్లలో కూడా ప్లాస్టిక్ వాడుతున్నారన్నారు. దీంతో భూ సారం కూడా తగ్గుతోందన్నారు. డ్రగ్స్, పొగాకు ఉత్పత్తులు, వాటి వినియోగం పై అవగాహన కల్పించాలన్నారు. అయితే హానికర ఉత్పత్తులపై ప్రభుత్వం కూడా కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భోజప్ప, ఎన్‌సీసీ ఆఫీసర్ సరస్వతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, రెడ్‌రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ అమరేష్, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు విద్యార్థులు పాల్గొన్నారు.

కంపచెట్లలో కార్యాలయం



అర్ధంతరంగా ఆగిన భవనం

రొళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోచూసి ఇదేదో అటవీ ప్రాంతం అనుకొంటే పప్పులో కాలేసినట్లే. ఇది అరణ్యం కానేకాదు... ఇది ఒక కార్యాలయ భవనం. అర్థాంతరంగా ఆగిపోయిన రొళ్ల మండలంలోని మల్లినమడుగు గ్రామ పంచాయతీ బల్క్‌మిల్క్ కార్యాలయం ఇది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణం చేపట్టారు. అది పునాదులే దాటలేదు. ఏళ్లు గడుస్తున్నాయి... పునాదులపై మొక్కలు మొలచి పెద్ద చెట్లుగా పెరిగాయి... ఇనుమ కడ్డీలు తుప్పుపట్టి పోతున్నాయి. ప్రజాధనం వ్యయం అవుతోంది.

కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

అగళి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్య ఉన్నప్పుడే సమాజంలో మనిషికి గౌరవం, విలువ ఉంటాయని ఇందులో భాగంగానే విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ -2 చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో సరస్వతి పూజా కార్యక్రమం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ పూజా కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ ఉమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యావంతులకే సమాజంలో గౌరవం ఉంటుందని ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సరస్వతి పూజ కార్యక్రమాన్ని పదవ తరగతి విద్యార్థులు, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం కేసులో ఇద్దరికి ఏడాది జైలు

గోరంట్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి కాలనీకి చెందిన మంజునాథ్, వడ్డె రామాంజనేయులుకు మద్యం కేసులో కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.రెండు లక్షలు జరిమానా విధించినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వీరిద్దరూ 2010 జూన్ 16న కర్ణాటకనుంచి 201 మద్యం టెట్రా ప్యాకెట్లు అక్రమ రవాణ చేస్తుండగా అప్పటి సీఐ జయనాయక్ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపి, చార్జిషీట్ దాఖలు చేయగా, పెనుకొండకోర్టులో విచారణ జరిగింది. సీఐ శేఖర్, కోర్టు కానిస్టేబుల్ భాస్కర్, నారాయణస్వామి, సాక్షులను ప్రవేశపెట్టగా ఏపీపీ శ్యామల వాదనలు వినిపించారు. నేరాలు రుజువు కావడంతో నిందితులకు పెనుకొండ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి బొజ్జప్ప ఒక్కొక్కరికి యేడాది జైలు శిక్ష, రూ.రెండులక్షల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.